## తెలంగాణా మాండలికంలో సొగసులు ప్రేమజంట సోయగాలు



# పట్నమొచ్చినపల్లె

## భూపాల్ · లేఖా నవలిక

వసంతా!

నీ రెండో ఉత్తరం కూడ అందింది. మీ నాయనకు జరం పూర్తిగా తక్కువయిందనుకుంట. నువ్వొస్తామన్న ముందురోజు రాత్రి నాకు నిద్ర పట్టలేదు. దినాం ఐదుగంటలకే లేస్తుంటి ఆయ్యాళ్ల మూడుగంటలకే ఐదవి పనులు షురూజేసిన. పెద్దమ్మ 'ఏందిట్లా' అని అడిగితే నువ్వొస్తున్నవని జెప్పిన. పదింటిదాకా పనులన్ని జేస్కొని సైదాబాద్ బస్టాప్ దెగ్గర నిలబడి నిలబడి యాష్టగొచ్చ. మూడుగంటల వరకు సూసి పేగులు ఆకలితోటి కేక లేస్తుంటే ఇంటికి పొయ్యి మల్ల తెల్లారీ రెండుగంటలు ఎదురుజూసి బస్సులన్నీ దేవులాడొచ్చిన. నీ ఉత్తరం ఒచ్చేదాన్క...ఏమైందా? అని అనుమానం భయం పీక్కతిన్నయ్.

ఇక్కడ నేను ఆడ్డపొడ్డ పనులు జేసుకుంట, పట్నమంత తిరుగుకుంట ఇంకోరి బాధా బణదీ లేకుండ రోజులెల్ల దీస్తున్న. నీ సంగతి ఇంకో తీరుగుంది. ఎన్నిరకాల యాష్ట పీడ్తున్నవో సూస్తె నీ ధైర్యాన్ని మెచ్చుకోవాలె. రోజూ నా పనులన్ని దీరినంక పగలు, రాత్రి జెర్ర వుర్సుతుంటది. పొద్దూకి ఏడు దాటిందంటే ఈడికి దెగ్గెరున్న లైబ్రర్కి పోతా. పత్రికలు సదువుతా. పదిమంది నాతోటోళ్లు దోస్తులైండ్రు. ఈ బస్తీల సంగతులు ఎన్నో మాట్లాడుకుంటాం. దాంట్ల భాగంగానే ఇక్కడో చిన్న యువజన సంఘం పెట్కమైంది. ఏదన్నా మంచి చెయ్యాలనుకున్న యువకులందరం కలిసి బస్తీల వున్న సమస్యలు ఆళ్లే తీర్చుకునేటట్టు. అంటే అర్థం కాకుండొచ్చు. ఇయ్యాలరేవు లీడర్లను నమ్మి ఏదన్నా సమస్య జెప్తే చూద్దాం చేద్దాం అంటున్నరు. అది ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్టుంటుంది. అట్లా కాదని పదిమందిమి పొయ్యి అడిగితే అ పని అయితదని చెప్పిన. ఆళ్లకు నిజంగనే అనిపిచ్చి సరే అన్నరు. మేముండే బస్తీల చెత్తకుండి నిండింది తీస్తందుకు వారం రోజులు కాదు రెండు రోజులకే తియ్యాలంటే అట్లే చేస్తున్నరు. నల్లాలు సరిగా రాక నీళ్లకు కటకటైతే అందరం పొయ్యి అడిగినం. ఇప్పడు జెర్ర నయమే, డ్రైనేజి మోరి నిండి ఎల్లపారుతుంటే సంఘం పేరు మీద కాగితం రాసి పంపితే వెంటనే ఒచ్చి సరి చేసిండ్రు. లైబ్రరికి మంచి పుస్తకాలు కావాలని అడిగితే ఒచ్చినయ్. వారం రోజులకొకసారి ఏదైనా విషయం మీద అందరం కూసుండి మాట్లాడుకుంటం. ఎట్లంటే 'మార్కెట్ల ధరలెందుకు పెర్గుతయి?' 'ఓట్ల కాలంలో వేలు, లక్షలు ఖర్చు ఎందుకు పెడ్తరు?' 'ఈ దేశంల ఎందుకింత దరిద్రముంది?' ఇవ్వన్నీ చర్చలే.

వసంతా! నీ ఉత్తరంల పెంటమ్మ, అత్త ముత్తమ్మ కత సదివినంక మనసంత బాధ పడ్డది. ఆ పోరగాడు ఎల్లయ్య ఏడు వానకాలాలన్నీ ఎరుగని వయసు. మన దేశంల ఆళ్లనంత 'బాల కార్మికులు' అంటారు. మొన్న పేపర్ల సదివిన ముక్కుపచ్చలారని పోరలు పొట్ట నింపుకుంటందుకు రెక్కలు ముక్కలు జేసుకొనేటోళ్లు ప్రపంచంలో ఉన్న అన్ని దేశాల కంటే మన దేశంల ఎక్కువున్నదట. ఇప్పడు ప్రభుత్వం లెక్కల ప్రకారమే మూడుకోట్లమంది అని తెలిసింది. 'నేటి బాలలే రేపటి పౌరులు-రేపటి పౌరులే భావి బానిసలు' అన్నట్లు.

అదట్ల వుండని ఈ నడుమ కట్నం ఇసం పురుగు కాటేశ్నందుకు ఒక సంసార మెట్ల కూలిందో కథ జెప్త ఇను.

మా పెద్దమ్మకు ఎప్పడూ పనులే అవి తీరవు. పెండ్లిళ్లు, పేరంటాలు, యాత్రలకు, చుట్టాలతానికి ఎక్కువ వోదు. గసొంటామే వారం రోజుల కింద పగలు నేను తింటందుకు ఇంటికి రాంగనే తయ్యారయ్యి పోతుంది. 'ఎందుకింత ఆదరబాదరగా పోతున్నవని అడిగిన' "సూర్యపేట్ల మా కోడలు మేనమామ గోపాల్‌రెడ్డి అంబాదోడు, మంచిమనిషి సచ్చిపొయ్యిండట పొద్దూకి సావు జేస్తరట పొయ్యొస్త అన్నది." 'ఎట్ల సచ్చిండు' అనడిగిన. 'పిచ్చిలేసిండే బస్సుకాడ పడి సచ్చిండట' తొందర్లున్నామెను ఇంకా అడిగితే బాగుండదని ఊకున్న.

అటెన్క తెల్లారి జరిగిన సంగతంత చెప్పింది. సూర్యపేట గోపాల్‌రెడ్డి భూమి తనఖా బ్యాంకుల (ఎల్.ఎం.బి.) కొలువు జేస్తడు. ఒక్కతే బిడ్డ కవిత. ఎంతో ఇదిగ కింద దించితే మన్నంటుదన్నట్టు పెంచి పెద్దజేసి బియ్యే సదువుతందుకు పట్నంల రెడ్డి ఉమెన్స్ కాలేజిల చేర్పిచ్చిండు. తన బిడ్డంటే ఎంత ఇష్టమో చెప్పాల్నంటే ఏందయ్యాంటే ఎంత పనివున్నా నాలుగైదు రోజులకొకసారి పట్నమొచ్చి హాస్టల్ల ఉన్న ఆమెను సూసి పోకుండ ఉండెటోడు గాదు. ఇట్లుండంగ ఎట్ల గలిసిందో ఏమో పుల్లారెడ్డి అని కమ్యునిష్టు మనిషి ఆంధ్రబ్యాంకుల పనిజేసే యువకునితోని సోబతి కలిసింది. మూడు నెలలు తిరగలే ఆ దోస్తాని లగ్గం వరకొచ్చింది. కమినిష్టి మనిషి గద సిద్ధాంతాలు నూరి జెప్పిండు కట్నమొద్దు పెండ్లి జేస్తే సాలన్నడు. తండ్రితోటి చెప్పింది కవిత. మొదలు జెర్ర బాధపడ్డ, గోపాల్‌రెడ్డికి తలంత బలగమున్నా, బిడ్డె మాట తీసెయ్యలే. ఆమె బాగుంటే తనకు సాలనుకున్నడు. పిల్లగాడు కమునిష్టు గదాని తెలంగాణా పోరాట త్యాగాలను గుర్తుకు తెచ్చుకుండు. ఇంటిక వొయ్యి పెల్లాంకు జెప్పితే మొగని మాట ఎన్నడు కాదనని ఆమె సరే అనక ఏమంటుంది? పెండ్లి పట్నంలనే జేసిండు. గోపాలరెడ్డి పెండ్లాం సుజాతమ్మ బలవంతాన ఐదు తులాల బంగారం పిల్లమెడలేసింది. బడీ బాసండ్లు, మంచాలు, అల్మారి, ఫంకా ఇంకా ఏంటియేంటివో మస్తుగ ఇచ్చిండ్రు. లగ్గమైపోయింది. పిల్లగాడు సికింద్రాబాద్ దెగ్గర సొంత ఇంట్ల వుంటడు మెట్టుగడ్డల.

నాల్గు నెలల్ల అత్తమామల, ఆడిబిడ్డల పోరు కవితకు నలభై ఏండ్లు అయింది. ఈ పెండ్లి ఆళ్లకెవరికి ఇష్టం లేదని తెల్సింది. రెండు లక్షల బదులు ఇరవైవేలు తెచ్చిన కవిత ఇంటిపనిమనిషకన్నా అద్వాన్నమైంది. ఐనా సరే అని ఏడ్చుకుంట

తూడ్సు కుంట కాలాన్ని ఎల్లదీసింది. నాల్గునెల్లు గడిసిన రెండోనాడు కవిత పేర ఉత్తరం ఒచ్చింది. దాంట్ల ఎవరో ఒకామే పుల్లారెడ్డి ఉంచుకున్నదట, ఇద్దరు పిల్ల తల్లట గట్టిగనే రాసింది. ఆ ఉత్తరంల ఏముందంటే పుల్లారెడ్డి మోసం జేసిండని, ఎన్నటికైనా పుల్లారెడ్డికి తనే భార్యనని, ఈ పిల్లగతేం గావాలనీ, ఆయిన ఇంకా ఒప్పకుంటే పానం దీసి తనూ, తన బిడ్డె బాయిలపడి సస్తామనీ!' ఆ రాత్రి భర్తను నిలదీసి ఉత్తరం సంగతి అడిగింది కవిత. అతను ఏం మాట్లాడలేదు. తిట్టింది. బతుకు బండలు చేస్తవన్నది. అతను ఆఖరుకు 'అదీ నా భార్యే, నువ్వూ నా భార్యవే ఉత్తరమొస్తే ఏమైంది మరి? అన్నడట. అంతే మరునాడు పగలు కవిత శవం దూలానికి యాల్లాడింది.

గోపాల్‌రెడ్డి సుజాతమ్మతోటి సావుకొచ్చిండు. పోలీసులు శవాన్ని పంచనామ జేసింద్రని, పోస్టుమార్టం జరిగిందనీ, పుల్లారెడ్డి బెయిలు మీద ఒచ్చిండనీ అన్నీ ఇన్నడు. తన కూతురుకు వందేండ్లు నిండినప్పుడు మొగడు బతికుండగ ఎట్లా ముత్తైద లెక్క సచ్చి కాటికి పోతదో అట్లే పీన్గను అలంకరించి బ్యాండు పెట్టి తీస్కపోతుంటే తను, తన సుజాతమ్మ వెన్క నడిచింద్రు. సుజాతమ్మ కాకి సోకం బెట్టింది. ఏం మాట్లాడక ఎన్క నడుస్తున్న గోపాల్‌రెడ్డి పక్కనే ఉండంగ ముంగట మంటలల్ల కవిత కాలిపొయ్యింది. ఎవరో ఇరవై వేలు ఆయన చేతిలో పెట్టింద్రు. ఆయన వెన్క ఒక చిన్నలారీల నాల్గునెల్ల కింద తను పెట్టిన సామానంత ఉంది. సుజాతమ్మ ఎక్కమంటే లారీలెక్కిండు. లారీ సూర్యపేటకు పొయ్యింది.

తన బిడ్డె బతికే ఉందని వారం రోజుల కోసారి హైద్రాబాద్ హాస్టల్ దగ్గర నిలబడి గంటసేపు సూసి పొయ్యేటోడు గోపాల్‌రెడ్డి. రెండు నెలలైనంక పిచ్చోడైండు. హైద్రాబాద్ రోడ్లపొంటి తిరుగుతుంటే సుజాతమ్మ బలవంతంగ సూర్యపేటకు తీస్కపొయ్యింది. ఇట్లైతే నేనేం కావాలని బతిమిలాడింది. ఎందరితోనో చెప్పించ్చింది. ఆయినేం మాట్లాడలేదు. అతనింటికి రాకున్నా. రాళ్లతోటి ఆమెనే కొట్టినా తిట్టినా యాల్లకింత తిండి యాదున్నా తీస్కపొయ్యి పెట్టింది. ఎప్పుడు మొగని ఎనుకనే పిచ్చిదాని లెక్క దిరిగింది. ఇంటికి రమ్మన్నది. అయిన ఇంటికి పోక గడ్డం పెంచుకుని బట్టలు చింపుకుని తిరిగీ తిరిగీ హైద్రాబాద్ బస్సుకోసం ఉరికీ ఉరికీ ఆ బస్సు కిందనే పడి కన్ను మూసిండు. బిడ్డ చావునూ, మొగని చావును కండ్లారా జూసిన సుజాతమ్మ పిచ్చిది కాలేదు గని ముందుగతి ఏందో ఆమెకే తెల్వదు.

సిద్ధాంతాలు మాట్లాడిన
ప్రతొక్కడు కమినిష్టోడుగాడు.
నీతితప్పిన ఏ కమినిష్టోడు మనిషి
కాడు.

వసంతా! మూడు నెలల్ల కవిత జీవితం ముడి పడిందనుకున్నది తప్పు. సిద్ధాంతాలు మాట్లాడిన ప్రతొక్కడు కమినిష్టోడు గాదు. నీతి తప్పిన ఏ కమినిష్టోడు మనిషి గాడు. కమినిష్టోడు ఐనా కాకున్నా సమాజం, సేవ, అక్రమాలు అనుకుంట మాట్లాడి పెండ్లికాడికొచ్చేవరకు కొజ్జాలెక్క చిలుంబట్టిన తల్లిదండ్రుల భావాలకు బానిసయ్యే మనిషి ఆడు పీన్గుతోటి సమానమే. పుల్లారెడ్డి అసొంటోళ్లు ఎంతో మంది మనకు కన్పిస్తరు. ఆళ్లతోటి భద్రంగ వుండి మంచి గుణపాఠం జెప్పాలె. గాని కవిత లెక్క సావడం పిరికిపని. ఐతే కవిత నిజంగా ఉరిపోసుకుందో లేకపోతే ఆమెను ఉరేసింద్రో ఇంకా ఎవ్వరికీ తెల్వదు.

వరకట్న నిషేధం అని శాసనాలు జేస్తరు. నిజంగా ఈ శాసనాలు చేసిన పెద్దలెంతమంది వరకట్నం ఇయ్యకుంట, తీస్కోకుంట ఉన్నరు. ఒక్కసారి గుండెమీద చెయ్యేసుకొని చెప్పమనాలె! వరకట్న మనేది మొదలు ఎక్కడికెల్లి పుట్టిందో అడగాలె. మొన్న పద్దెనిమిదో తారీఖున వరంగల్ల తీవ్రవాదులకు, పోలీసులకు నడుమ కాల్పుల్ల కొత్తూరు పాపారావు, గొండ్ల రాజమౌళి చచ్చిపోయారట. పోలీసులు ఎప్పుడు ఎదురు కాల్పులు జరిపినా తీవ్రవాదులే ఎందుకు సస్తరు? కాదు, ఆ తీవ్రవాదులనేటోళ్లను ఎక్కడనో పట్కోని ఎక్కడికో తీస్కపొయ్యి రాక్షసుల్లెక్క కాల్చి సంపుతున్నరని జనం అంటుంద్రు. ఇట్లా కాల్చి సంపాలని మన భారతప్రభుత్వ ఏ చట్టంల ఉన్నది? వీళ్లు చట్టాలను, శాసనాలను మెదడులుంచుకొని ప్రజలకు ఉపయోగపడే ఏ పని చేస్తున్నరో నాకు తెలువదు.

వసంతా! ఏదేదో తోచింది. ఆవేశంల రాసిన. అర్థం చేసుకో! ఆవేశమొచ్చినప్పుడు నిజం బైట పడ్తుందంటరు. నేను నిజమే రాసిన. నీ ఉత్తరంల ఈ నడుమ ఊరిల పిడుగుపడి చెట్టు నగం కాలిపోయిందని చెప్పినవ్ గద. పిడుగు మనం అనుకున్నట్టు రథం శాయి శిలనో, ఇనుప కడ్డో కాదు. మొగులు మీద తెప్పలు తెప్పలు రాసుకున్నప్పుడు అక్కడ పుట్టే కరెంటు భూమికి 'ఎర్త్' అయ్యి షాట్ కొడ్తది. దాంతోటి కాలిపోవటం, కూలిపోవటం కూడ ఐతయి. ఇది అర్థం గాకుండొచ్చు నాకు మనం కలిసినప్పుడు వివరంగ జెప్త.

మీరు భూముల యివరాలు తీయడం చాలా సంతోషం. అవి మన కవసరం.

చాన రాసిన. ఇక ఉంట.

నీ

చంద్రయ్య.

*2.10.1980.*

